REGD. NO. A. 40 విడి ప్రతి 0-20 న. పై శుక్రవారం 25-11-60

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 32 * సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి * సంచిక 47

## లేక లేక వారసుడు పుడితే...

సంతానం కొరకు కలలుగని, పూజలుజేసి, యాత్రలు సేవించి, లేక లేక పుడితే మామూలు కుటుంబాలలోనే తల్లి దండ్రుల ఆనందానికి మేరవుండదు. ఇక, వారసుని కొరకు తపస్సుజేసే రాజులకు పుత్రుడు జన్మిస్తే, వారి సంతోషానికి హద్దులుంటాయా? షా మహమ్మద్ రేజా పహ్లావి సంతానహీనుడు కాదుగాని, ఇరాన్ మయూర సింహాసనానికి వారసుడులేని రాజు. మొదటి భార్యకు ఒక కుమార్తెవుంది గాని, కొడుకులేని కారణంగా 1948 లో ఆమెకు విడాకులిచ్చాడు. సౌందర్యానికి ముగ్ధుడై పరిణయమాడిన ద్వితీయ కళత్రం సొరయాకు అసలు సంతానమేలేదు. ఎంతో బాధతో షా ఆమెనుకూడా 1958 లో వుద్వాసనంజేశాడు. పారిస్ శిల్పకళా విద్యార్థిని, సామాన్య కుటుంబానికి చెందిన 22 ఏండ్ల యువతి ఫరా దిబాను గత ఏడాది వివాహమాడాడు. పదిమాసాలు తిరగకముందే ఆమె ఇరాన్ సింహాసనానికి వారసుణ్ణి యిచ్చింది. షా ఆనందాతిశయంతో గంతులేస్తూ చేతులెత్తి అల్లాకు మ్రొక్కాడు. దేశంలోని అన్ని కార్యాలయాలకు రెండురోజులు శలవుయిచ్చాడు, ఇకాకంటాక్స్ నూటికి 20 పాళ్లు త్రోసివేశాడు, 98 మంది ఖైదీలకు బంధముక్తి గావించాడు. 41 తుపాకులు 'ఢాం ఢాం' మంటూ యువరాజుకు స్వాగత మిచ్చాయి. ఇరాన్ దేశమే పండుగ జేసుకొన్నది.

## హైదరాబాదు లేఖ

### ● షరతులన్నీ వదలుకొని అధ్యక్షస్వీకారానికి శ్రీ పళ్లంరాజు అంగీకరించుటకు కారణం?

### ● నదీజలాల వివాదం - మహారాష్ట్ర పలుకుబడి: ప్రభుత్వం, పార్లమెంటుసభ్యులు ఏంచేస్తున్నారు

ఇంతకాలయాతన చేయుటాలక, మళ్లీ పూడి పళ్లంరాజు మంత్రిపదవిని వదలుకొని ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవీ బాధ్యత వహించడానికి సమ్మతిస్తూ ప్రకటనచేశారు. ఇలాంటి ప్రకటన అదివరకోచేశారు. కాని ఈసారి అల్లూరి, నరోత్తమరెడ్డిగార్ల సమక్షంలో ఈ ప్రకటన చేయడమేకాక అధ్యక్షుని ఎన్నికకు డిశంబరు 4 తేదీని నిర్ణయిస్తూ ప్రస్తుతాధ్యక్షుడు మరొక ప్రకటనచేశారు. కాబట్టి డిశంబరు 4 తేది వరకైనా నమ్మవలసి వుంటుంది. కాంగ్రెసు అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి గారుకూడా డిశంబరు 4 తేది నాటి సమావేశానికి హాజరవుతారట. యూనిటీఫ్రంట్ రద్దు, కార్యవర్గ పునర్నిర్మాణం, ప్రదేశ్ ఎన్నికలసంఘంలో నరోత్తమరెడ్డిగారికి స్థానం – ఇలా పెట్టిన షరతులన్నింటినీ ఒకటి తరువాత ఒకటి పళ్లంరాజుగారు, అంటే అధికారపక్షంవారు, వదులుకున్నారు.

అయితే, ఇంతటితో ప్రదేశ్ కాంగ్రెసులో కలిగిన కలతలు సమసిపోయాయనడానికి వీల్లేదు. కార్యవర్గాన్ని పళ్లంరాజుగారు మార్చినా మార్చకపోయినా, మరి కొన్ని విషయాలపైకూడా, ముఖ్యంగా మంత్రివర్గ పునర్నిర్మాణంగూర్చికూడా అంగీకారం కుదరకపోతే ఇప్పటి అస్థిరమైన పరిస్థితులు మారవు. రాష్ట్రశాసనసభల శీతాకాల సమావేశం సందర్భంలో పార్టీ సమావేశాలు చేయించి, మంత్రివర్గ సభ్యులను దుయ్యబట్టాలని యూనిటీఫ్రంట్ నాయకులు సన్నద్ధమవుతున్నారు, కొందరు మంత్రులు చేసిన "నేరాల" గూర్చి విషయ సేకరణకు కొందరు మాజీ మంత్రులతో ఒక ఉపసంఘం కూడా ఏర్పడింది. వీటి పరిణామం వూహించగలిగిన అధికారపక్ష నాయకులు ఎందుకైనా మంచిదని డిశంబరు 4 తేదీన పళ్లంరాజుగారి ఎన్నికను ఒప్పుకొని అవాంతరాన్ని ప్రస్తుతానికి దాటామని భావించినా ఆశ్చర్యం లేదు. మరొక రెండువారాలు గడిస్తే (డిశంబరు 16 తేదినాటికి) శాసనసభల సమావేశాలు మొదలౌతాయి. కాబట్టి మళ్ళీ ఇంతమంది పార్టీసభ్యులు ఒకచోటకూడడం కులభమైన పనికాదు. అసలు పార్టీసమావేశాలంటూ జరపకుండానే గడపాలని పార్టీనాయకులు యత్నించవచ్చునుకూడా. అప్పుడు పార్టీ సమావేశం జరిపించడానికి యూనిటీఫ్రంట్ వారు మళ్లీ రిక్విజిషను నోటీసు ఇవ్వవలసి వుంటుంది. ఇలా ఈ తగవులు కొనసాగుతూనే వుంటాయి.

పరిస్థితి ఇలా వున్నంతకాలం పరిపాలనా వ్యవహారాలు కుంటుపడక మానవు. తమ కలహాలతోనే తీరికలేని మన మంత్రులకు రాష్ట్ర సమస్యలగూర్చి ఆలోచన చేసేతీరిక ఎక్కడ?

నదీజలాల తగవులాట విషయమై మనకు అనుకూలంగా వ్రాసిన ప్రధాన జాతీయ దిన పత్రిక ఒకటీ కనపడదు. కొంతకాలంక్రితం హిందూ పత్రికలో మనకు కొంత అనుకూలంగావున్న సంపాదకీయం వచ్చింది. ఇది రెండుమాసాలక్రితం. మళ్లీ ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్య లేదు. కాని టైమ్సుఆఫ్ ఇండియా, హిందూస్తాన్ టైమ్సులాంటి పత్రికలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వవైఖరిని విమర్శిస్తూ వ్యాసపరంపరలు వస్తున్నాయి. వీటికి సమాధానం యిచ్చేవారు కనపడటం లేదు. మన సమాచారశాఖ దాని ఐ.ఏ.ఎస్. డైరెక్టరు ఏంచేస్తున్నారో దేవుడికేతెలుసు. మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నట్లు మధ్యవర్తి పరిష్కారానికి కాని, న్యాయవాదుల తీర్పుకుకాని కేవలం సమ్మతించమని చెప్పినంతమాత్రాన సరిపోతుందా? కేంద్రప్రభుత్వంలో పలుకుబడికల మహారాష్ట్ర ప్రభుత్వం పట్టుదలపై కేంద్రం మధ్యవర్తిత్వానికి యీ తగాదాను నూదిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏంచేస్తుంది?

—కొరవ 7-వ పేజీలో

## ఆంధ్రరాష్ట్ర ఇనాం రైతు మహాసభ

### డిసెంబరు 11 నెల్లూరులో

ఆంధ్రరాష్ట్ర ఇనాం రైతు మహాసభ 11-12-60 ఆదివారం నెల్లూరులో జరుగును. రెవిన్యూమంత్రి

శ్రీ కె. వి. రంగారెడ్డిగారు

పాల్గొందురు.

వివిధ జిల్లాలలోని ఇనాం రైతులందరూ పాల్గొనవలసిందని–

రాష్ట్ర ఇనాంరైతుమహాసభ ఏర్పాట్లు: తయారు జేయవలసిన మెమొరాండం మున్నగు విషయాలను చర్చించుటకు, నెల్లూరుజిల్లాలోని ఇనాంరైతు ప్రతినిధులు తమతమ సమస్యలతోటి 30-11-60 తేది మ. 2 గంటలకు నెల్లూరు 'జమీన్ రైతు' కార్యలయ భవనంలో జరుగు సమావేశమునకు రావలసిందని శ్రీ చెరుకూరు రామరెడ్డి, శ్రీ గ్రిద్దలూరు శంకరయ్య గారలు కోరుతున్నారు.

## నెల్లూరుజిల్లా పరిస్థితి

# విశేషవర్షలు: విపరీతనష్టాలు

—0—

### గండ్లుపడిన చెరువులు - వెల్లువపాలైన పైర్లు - కూలిపోయిన ఇండ్లు - తెగిపోయిన రోడ్లు

ఈ నెల 1 నుండి 11 తేదివరకు కురిసిన కుంభవృష్టివల్ల కలిగిననష్టం యింకా పూర్తిగా తెలియ లేదు. ఇంతలోనే 20, 21, 22 తేదులలో విపరీతవృష్టి.

#### 30 పదున్ల వర్షం

ఈ నెలలో యిప్పటివరకు మొత్తం 30 పదున్ల వర్షం కురిసింది. 1 తేదినుండి 3 వరకు 5.39 అం; 5 నుండి 11 వరకు 17.36 అం; ఈ వారంలో 6.67 అం. – మొత్తం 29.42 అం.

#### రైళ్ల రాకపోకలు

ఈ వర్షంవల్ల తిరిగా యీ వారంలో రైళ్లు, బస్సులరాకపోకలకు తీరని ఆటంకం ఏర్పడింది. ఆక్రం పేటవద్ద రైలుపై నీరు పారుతున్నందున అన్ని రైళ్ళు రద్దయి, ఒక్క ఎక్స్‌ప్రెస్, మెయిల్ మాత్రం రెండేసి గంటలు మూడుగా రాకపోకలు సాగిస్తూ, నిన్నటి నుండి విజయవాడ–రేణిగుంట, చిత్రగుంట–గూడూరు ప్యాసింజర్లుతప్ప తక్కిన రైళ్లన్నీ మామూలు ప్రకారం నడుస్తున్నవి.

#### బస్సుల ఆటంకం

మనుబోలు – గూడూరుమధ్య గత వర్షాలకు ట్రంకురోడ్డులో పడిన గండివల్ల యింకా వారంలో తిరిగా బస్సుల రాకపోకలు నిల్చిపోయి, నిన్నటినుండి సాగుతున్నవి.

—కొరవ 7-వ పేజీలో

నిర్మల

ప్లాంటేషన్ * కాపీపొడి


స్పెషల్ * వక్క పొడి

.. అన్ని షాపులలో దొరకును ..

నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు — నెల్లూరు

గ్రాము : నిర్మల ఫోన్ : 230




## ● వెంకటగిరి పంచాయతీ ఉప ఎన్నిక: నష్టాన్నుండి లాభానికి చేర్చబడిన స్టోరు ● ఉదయగిరి చౌకడిపోలు: పంచాయతీ విజ్ఞప్తి

### వెంకటగిరి పంచాయతీ

పంచాయతీ సభ్యులు శ్రీ పి. యల్. చెంచయ్య నాయుడు, షేక్ కాశేషా గారలు రాజీనామా యివ్వగా, ఆ స్థానాలకు 7 తేదీ ఉపఎన్నిక చాలతీవ్రంగా జరిగింది. చెంచయ్య నాయుడు గారి స్థానంలో శ్రీ యస్. గోపాల నాయుడు; కాశేషా గారి సీటులో శ్రీ వరద రాజులు గారలు మంచి మెజారిటీతో ఎన్నుకోబడినారు.

ఈ ఉపఎన్నికవల్ల రాజాగారిపార్టీబలం ఒకటి పెరిగినట్లు తెలుస్తున్నది. —ఓ. వి.

### వెంకటగిరి స్టోర్సు

కో ఆపరేటివ్ స్టోర్సు సర్వసభ్య సమావేశం 13 తేది శ్రీ రావిళ్ల రాజగోపాలరావు గారి అధ్యక్షతన జరిగింది. 1959–60 సరి పాలనావార్షిక నివేదిక; 1958–59 ఆడిట్ రిపోర్టు; 1959–60 రివైజ్డుబడ్జెటు; 1960–61 బడ్జెటులపై చర్చజరిగి ఏకగ్రీవంగా ఆమోదించబడినవి. గత సంవత్సరం స్టోర్సువక్షంగా గూడూరుడివిజన్ చక్కెర హోల్ సేల్ వ్యాపారంచేసి, టర్నోవరు 3 లక్షలుగా సాధించి, అంతకుముందు వచ్చిన రూ 23,000 ల నష్టాన్ని భర్తీచేసి, స్టోరును

—కారవ 11.వ పేజీలో

### సమితులు: సమాజ సేవ

### కొండపి సమితి ప్రణాళిక

కొండపి పంచాయతీ సమితి తృతీయ ప్రణాళిక 29 లక్షల రూపాయలతో రూపొందించబడింది. స్థూలంగా వివిధ పద్దులక్రింద కేటాయింపు యిది:-వ్యవసాయం తదుపరాభివృద్ధికి నూటికి 30 పాళ్లు; ప్రాథమిక విద్యకు నూటికి 30 పాళ్లు; రహదారుల అభివృద్ధికి నూటికి 9 పాళ్లు; ఆరోగ్యాభివృద్ధికి నూటికి 9 పాళ్లు.


కేటాయింపు వివరం: వ్యవసాయం 1 లక్ష 34 వేలు; చిన్న నీటివసరుల మరమ్మత్తు 3 లక్షల 60 వేలు; పశుగణాభివృద్ధి 42 వేలు; రైతుల ఋణసహాయానికి 3 లక్షల 34 వేలు; ఆరోగ్యాభివృద్ధికి 1 లక్ష 89 వేలు; ప్రాథమికవిద్యకు 8 లక్షల 88 వేలు; సాంఘిక విద్యకు 87 వేలు; సహకారానికి 65 వేలు; గ్రామీణ రహదారుల అభివృద్ధికి 2 లక్షల 60 వేలు; గృహ పరిశ్రమలకు 83 వేలు: సిబ్బంది గృహనిర్మాణానికి 80 వేల రూపాయలు.

మొత్తం వ్యయంలో 4 లక్షల రూపాయలు ప్రజలు, పంచాయతీలనుండి విరాళ రూపంలో చేకూరగలవని అంచనా వేయబడింది. —యం. కోటయ్యచౌదరి.

### చందలూరు రంగా పార్కు

దర్శి సమితిలోని చందలూరు పంచాయతీ వారు యేర్పాటు చేసిన పిల్లలపార్కుకు "రంగాపార్కు" అని నామకరణం జరిగి, 15 తేది సమితి అధ్యక్షుడు శ్రీ రావిపాటి మహానంద గారిచే ప్రారంభోత్సవం గావించబడింది. ఈ సందర్భంలో గ్రామమంతా రమ్యంగా అలంకరించబడింది. సభకు శ్రీ గోపాలని వెంకటరమణయ్యగారు అధ్యక్షత వహించారు. యస్. ఇ. ఓ. శ్రీ కృష్ణమూర్తి సమితి కార్యక్రమాలను సమీక్షించారు. బి. డి. ఓ. శ్రీ కనుపులేటి సత్యనారాయణరావు ప్రత్యేకులు పార్కులో వనమహోత్సవం గావించారు. శ్రీ చెన్నా

—కారవ 11.వ పేజీలో



గూడూరులో చిత్రహింసలకు గురిచేయబడిన ముస్లిం తల్లి – కొడుకులు జైనాబీ, హబీబ్ ఖాన్

# ఎన్నికల వైషమ్యాలు వీడితేనే అభివృద్ధి

## పొదిలి సమితిని ప్రారంభిస్తూ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి ఉద్బోధ

పొదిలి పంచాయతీ సమితి ప్రారంభోత్సవం, 20 తేది సాయంకాలం, ప్రణాళికా శాఖామాత్యులు శ్రీ పిడతల రంగారెడ్డిగారిచే జరుపబడింది.

కమ్యూనిస్టు నాయకుడు శ్రీ తరిమెల నాగిరెడ్డి గారి రాక సందర్భంలో అంతకు క్రితంరోజు జరిగిన అలంకరణలో, సమితి ప్రారంభోత్సవ చిహ్నంగా అమర్చబడిన త్రివర్ణపతాకాలు కలకలమంటూ కలిసిపోయి, సమితి అధ్యక్ష ఎన్నికలో శ్రీ రామిరెడ్డి – కమ్యూనిస్టుల మిత్రత్వాన్ని చాటడమేగాక, రామిరెడ్డి కాంగ్రెస్ వాడేననిగూడా హెచ్చరించినవా అనిపించినది.



ఈ ప్రారంభోత్సవంలో కలెక్టరు శ్రీ జి. వి. రామకృష్ణ, జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ పి. మల్లికార్జునం, శాసనసభ్యులు శ్రీ మూలాసాహెబు, శ్రీ కాశిరెడ్డి, వేస్తవారపుపేట, దర్శి సమితి అధ్యక్షులు శ్రీయుతులు చప్పిడి వెంకయ్య, మహానంద, కనిగిరి పంచాయతీ అధ్యక్షుడు శ్రీ దేవిరెడ్డి లక్ష్మిరెడ్డిగారలు పాల్గొన్నారు. రానివారలలో ముఖ్యులు జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ చెంచురామానాయుడు, పొదిలి పంచాయతీ అధ్యక్షులు శ్రీ నారాయణస్వామి.

మంత్రిగారు రాగానే స్వాగతం చెప్పబడి, రహదారి బంగళాలో అల్పాహార విందు గావించబడింది. తదనంతరం ఉత్సవంతో కొంపోబడిన మంత్రి శ్రీ రంగారెడ్డి బ్లాకు కార్యాలయాన్ని ప్రారంభించి, బహిరంగ సభకు విచ్చేశారు.

అధ్యక్షత వహించిన కలెక్టరు శ్రీ రామకృష్ణ మంత్రిగారికీ, సదస్యులకు స్వాగతమిచ్చారు.

తర్వాత పొదిలి సమితి, పంచాయతీ, పౌరులపక్షంగా మంత్రిగారికి సన్మాన పత్రములు సమర్పించబడినవి. పంచాయతీ సన్మానపత్రాన్ని అధ్యక్షుడు శ్రీ నారాయణస్వామి గాకుండ, వ్యతిరేక పక్షీయుడైన శ్రీ మావ్యాల శ్రీహరి సమర్పించడం విశేషం. పొదిలి పెద్దచెరువుకు గండ్లుపడకాలువ త్రవ్వించి, ఆ చెరువు ఆలుగునీరును చిన్న చెరువుకు మరలించమని; ప్రభుత్వ సాంకేతిక అనుమతిపొంది వున్న నీటిసరఫరా పథకాన్ని ప్రభుత్వమే పూర్తి సబ్సిడీయిచ్చి అమలుజరిపి, పొదిలి ప్రజలను ఫ్లోరిన్ విషఫలితాలనుండి రక్షించమని, పంచాయతీవారు మంత్రిగారికోరారు.

—కారవ 11.వ పేజీలో





అసోసియేటెడ్ ఏజంట్లు: సీతారామ జనరల్ స్టోర్సు ...

అశోకా రాయల్ టాల్క్ పౌడర్ డీలక్స్ నూతనోత్సాహానికి, మరులు గొలుపు పరిమళానికి



జేలాది సినీతారలు, సౌందర్య వతులు ఈ అపూర్వమైన రాయల్ టాల్కు పౌడరు, డీలక్సును ఉపయోగించి, వారి సౌందర్యమును పెంపొందించుకొనుచున్నారు.

విజయా కెమికల్సు
35, ...
... – మద్రాసు–7.

స్టాకిస్టు:- రామా ఏజన్సీస్ - నెల్లూరు

# ఆగర్భశ్రీమంతుడైనా నిరాడంబరజీవి, భారతదేశ అభిమాని; అమెరికా క్రొత్త అధ్యక్షుడు

# శ్రీ జాన్ కెనడీ

## * జీవిత చిత్రణం *

నవంబరు 8 తేదీన జరిగిన అమెరికన్ ప్రెసిడెంట్ ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి శ్రీ జాన్ ఎఫ్. కెనెడి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి శ్రీ రిచర్డ్ నిక్సన్ను ఓడించి ప్రెసిడెంటుగా ఎన్నికైనారు. అమెరికన్ అధ్యక్షపదవి అధిష్టించిన కడుపిన్న వయస్కులలో ఈయన ఒకరు. వీరి వయసు 43 సంవత్సరాలు.

శ్రీ కెనెడి మేసచుసెట్స్ రాష్ట్రంనుంచి ఎన్నికైన సెనెటర్. ఆయన 1956లో వైస్ ప్రెసిడెంట్ పదవికోసం డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి పోటీచేసి ఓడిపోయారు.

ఆయన 1960 కన్వెన్షన్లో ప్రెసిడెంటు పదవికి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కావటం తథ్యమేనని అప్పటినుంచి అంతా భావిస్తున్నారు. ఆయనకు విదేశాంగ వ్యవహారాలు, కార్మిక వ్యవహారాలపట్ల ప్రబలమైన ఆసక్తి. ఈ రంగాలలో జరిగే వాదనలమీద ఈయన పలుకుబడి బాగా వినబడుతుంది. వ్యక్తిగతంగా చాల సహృదయుడని ప్రతీతి.

ఆయన అమెరికా జాతీయ, రాజకీయ ప్రముఖులలో ఒకరని 1956 లో జరిగిన డెమొక్రాటిక్ పార్టీ సమావేశంవల్ల దేశమంతటికీ తెలిసింది. అయితే ఆయన మేసచుసెట్స్ రాష్ట్రంనుంచి ఎన్నికైన కాంగ్రెస్ సభ్యుడుగా వాషింగ్టన్లో పదిసంవత్సరాల పూర్వంనుంచి ప్రఖ్యాతిచెందారు. కాంగ్రెసులో ప్రతినిధుల సభాసభ్యుడుగా 1946 లో మొట్టమొదట శ్రీ కెనెడి ఎన్నికైనారు. అప్పుడాయన వయసు 29 సంవత్సరాలు. తన 35వ ఏట అమెరికన్ సెనేటుకు పోటీచేసి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, పేరు ప్రతిష్ఠలు సంపాదించిన హెన్రీ కాబట్ లాడ్జిని ఓడించారు.

కెనెడి తలిదండ్రులకు తొమ్మండుగురు పిల్లలు. కెనెడి 1917 మే 29 న బ్రూక్లైన్లో జన్మించారు. ఆయన తండ్రిపేరు జోసెఫ్ కెనెడి. ఆయన మంచి వ్యాపారవేత్త. 1937 నుండి 1940 వరకు బ్రిటన్లో ఆయన అమెరికా రాయబారి. జోసెఫ్ కెనెడి తాతపేరు జాన్ ఫ్రాన్సిస్ ఫిట్జెరాల్డు. ఈయన అమెరికా కాంగ్రెస్ సభ్యుడుగా, బోస్టన్ నగరం మేయరుగా పనిచేసినవారు.

తండ్రి, తాతలు రాజకీయవేత్తలు కనుక, ఈయన చిన్నవయసునుంచీ కూడా రాజకీయాలలో విజయంపొందడంలో ఆశ్చర్యంలేదు. కెనెడి సోదర సోదరీమణులకు చిన్నప్పటి నుంచి మీరు గొప్పవారు కావాలంటూ తల్లిదండ్రులు బోధచేసేవారు.

జాన్ కెనెడి తన శక్తిసామర్థ్యాలన్నింటినీ ప్రజాసేవకోసం వినియోగిస్తూ రాజకీయప్రతిష్ఠ పొందారు. పండితుడుగా, జర్నలిస్టుగాకూడా యింతగానూ విఖ్యాతిచెందారు. 1940 లో హార్వర్డు యూనివర్సిటీలో చక్కని మార్కులతో పట్టాపొంది, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్లో చదివారు.

1941 సెప్టెంబరులో ఆయన అమెరికన్ నౌకాదళంలో చేరారు.

1941–45 మధ్య ఆయన నైరుతి పసిఫిక్ సముద్రంలో పెట్రోల్ టార్పెడో బోట్ కమాండరుగా పనిచేశారు. సాలమన్ దీవుల యుద్ధంలో ఆయనవున్న బోటు ముంచివేయబడింది. దానిలో ఆయన ఆత్మరక్షణ చేసుకొనడం మాత్రమేగాక, మరోక ముగ్గురు సైనికుల ప్రాణాలనుకూడా కాపాడారు. వారిలో ఒకనిని నీటిలో అనేక మైళ్ళు తోసుకుంటూ తీసుకువచ్చి రక్షించారు. ఇంతటి వీరోచితకార్యం చేసినందుకు ఆయనకు అమెరికానౌకాదళం పతకాన్ని బహూకరించింది. ఆయన గాయపడ్డందుకు పర్పుల్ హార్ట్ అనే పతకాన్ని యిచ్చారు. ఈ గాయాలను మాన్పుకొనటంకోసం కెనెడి చాలాకాలం ఒక సైనిక వైద్యాలయంలోవుండి 1945 లో బయటకు వచ్చారు.

యుద్ధానంతరం కెనెడి ఇంటర్నేషనల్ న్యూస్ సర్వీస్ విలేఖరిగా పనిచేస్తూ 1945 లో ఐక్యరాజ్యసమితికి రూపమిచ్చిన శాన్ ఫ్రాన్సిస్కో సమావేశం వార్తలను పంపుతుండేవారు. 1945 లో బ్రిటిష్ ఎన్నికలను, ఆదేసంవత్సరంలో పోట్స్డం సమావేశ వార్తలను పంపేవారు.

అమెరికా యూనియర్ చేంబర్ ఆఫ్ కామర్సు సమితివారు 1946 లో ఎన్నికచేసిన పదిమంది అమోఘ శక్తిసంపన్నులలో ఆయనొకరు.

కెనడి తనతండ్రి బ్రిటన్లో రాయబారిగావున్న రోజులలో 'వై ఇంగ్లండ్ స్లెప్ట్' అనే గ్రంథం రచించారు. రాజకీయాలలో అద్భుత సాహసాన్ని ప్రదర్శించిన వారి చరిత్రలుగల గ్రంథంయిది. 1954 లో ఆయన ఒక అనారోగ్యంనుంచి కోలుకొంటున్న రోజులలో దీనిని రచించారు. దరిమిలా ఈగ్రంథానికి పులిట్జర్ బహుమానమిచ్చారు. అమెరికాలో కల్లా యిది అత్యుత్తమ సారస్వత బహుమానం. దీనిలో ఎనమండుగురు అతిసాహసోపేతులైన అమెరికన్ల గాధలు వున్నాయి. ఈ సెనేటర్లు తమ పార్టీల మాత్రాలకోసంగాని, తమ నియోజకవర్గాల ప్రయోజనంకోసంగాని కాకుండా తమ విశ్వాసానుసారంగా కృషి చేసి తమజీవితాలను త్యాగంచేశారు. వారిలో కొందరు నాశనమయ్యారు.

కెనెడి పయితం అనేక సందర్భాలలో వారిలాగే అత్యంత స్వేచ్ఛతో ప్రవర్తించి జాతీయ ప్రయోజనంకోసం మాత్రమే పనిచేశారు.

1959 సంవత్సరారంభంలో కెనెడి సెనెటులో ఇండియా గురించి ఒక తీర్మానం ప్రతిపాదించి, ఇండియా ఆర్థికాభివృద్ధి పట్ల తన ఆసక్తి వెల్లడించి వున్నారు. ఆ తీర్మానంలో భారత అవసరాలు గురించి ప్రచారం చేయటానికి ఒక బహుళార్థ ఆర్థిక సంస్థ నిర్మాణం కావాలని ప్రతిపాదిస్తూ, భారత ఆర్థికాభివృద్ధికి బాగా తోడ్పడగల పున్మాడి మార్గాలను సిఫార్సు చేశారు.

ఆ సందర్భంలో కెనెడి పాశ్చాత్య దేశాలనుంచి భారతదేశానికి దీర్ఘకాలిక సహాయం కొనసాగాలని ఈ ప్లాటిఫారం యిట్లా అన్నారు: "స్వల్పకాలిక సహాయం కొరకటానికే ప్రయత్నించినట్లయితే, ఇండియా ప్రజాతంత్ర అభివృద్ధి ప్రణాళికలు మధ్యలోనే ఆగిపోవలసి వస్తుంది".

తర్వాత ఆ తీర్మానంలో ఆఫ్ఘనిస్తాన్, బర్మా, సింహళం, నేపాల్, పాకిస్తాన్లను కూడా పొందుపరచటంద్వారా దక్షిణాసియా దేశాల అభివృద్ధిపట్ల సోదర్భాప్రకటం చపు ఆసక్తిని ప్రదర్శించటం జరిగింది. ఆ దేశాల ఆ ప్రజల జీవనప్రమాణాలు సత్వరంగా అభివృద్ధి చెందవలసిన ఆవశ్యకతను యీ తీర్మానం నొక్కి వక్కాణించింది.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి కెనెడి పోటీ చేసినప్పుడు తన ప్రచారంలో విదేశాంగ విధానపు సలహాదారులలో ఒకరుగా భారతదేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన చెస్టర్ బౌల్సును నియమించుకోటంద్వారా ఇండియాపట్ల కెనెడి ఆసక్తి మరోకసారి వ్యక్తమైంది, లాస్ ఏంజలిస్ డెమొక్రాటిక్ పార్టీ కన్వెన్షన్లో ఆమోదించబడిన ఎన్నికల ప్రణాళికలో దక్షిణాసియా దేశాలకు [illegible] నికి కెనడీ హామీ ఇచ్చారు.

ఎన్నికల ప్రణాళికలో యిట్లా వున్నది. "భారత పాకిస్తాన్ దేశాలు విభిన్న వాతావరణాలలో నిరక్షరాస్యత, దారిద్ర్యం, అనారోగ్యం వంటి తమ చిరకాల సమస్యలను పరిష్కరించుకొనడం స్వేచ్ఛా ప్రజల శక్తికి అగ్నిపరీక్షవంటిదని మేము గుర్తిస్తున్నాము. అట్టి సమస్యల పరిష్కారానికి మేము సర్వవిధాలా తోడ్పడుతాము."

కెనెడి తన ఎన్నికల కార్యక్రమంలో భారతదేశం తదితర వర్ధమాన దేశాలకు ఇతోధిక సహాయం చేయాలని వక్కాణించారు.

గత సంవత్సరం అమెరికాలో భారత–అమెరికన్ నిపుణులు జరిపిన ఒక సమావేశంలో కెనెడి ప్రసంగిస్తూ, "మానవ విలువలు, వ్యక్తిస్వేచ్ఛలకు అనుగుణంగా భారతదేశం తన విధానాలను రూపొందించుకొని అమలు జరుపుకొంటున్నది" అన్నారు.

కెనెడి పుట్టుకతోనే శ్రీమంతుడైనప్పటికీ నిరాడంబరంగా జీవిస్తారు. ఆయన తన భార్య జాక్వెలైన్ ఏకైక పుత్రికతో వాషింగ్టన్ శివార్లలో ఒక సామాన్య గృహంలో ఉంటున్నారు.




ఆధికవర్షాలకు ******

****** భయపడకండి.

వెచ్చవెచ్చని బట్టలు - ఉల్లులోను - సిల్కులోను - నేతలోను - అన్నిటిలోనూ మంచి మంచి మాదిరీలు తెచ్చియున్నాము. మీ యిష్టమువచ్చినన్ని తీసికొనండి.

☞ దయచేసి విచ్చేయండి

సిల్కు ప్యాలెస్

ట్రంకురోడ్డు — నెల్లూరు

